క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో గల గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం నరక చతుర్దశి సందర్భంగా అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏర్పాటు చేసి జంతుబలులు నిర్వహించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిక్షణకు వెళ్లిన వ్యవసాయాధికారి

ముద్దనూరు : మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం నుంచి 5 రోజుల పాటు హైదరాబాదులో శిక్షణలో పాల్గొననున్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విస్తరణ విద్యా సంస్థలో వాతావరణ మార్పు విస్తరణ పద్ధతులపై 14వతేదీ నుంచి 18వతేదీ వరకు ఆయన శిక్షణలో ఉండనున్నారు.

నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక

చక్రాయపేట : కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు మంగళవారం చక్రాయపేటకు రానున్నట్లు మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ తెలిపారు. ఉదయం 6గంటలకు ఆయన చక్రాయపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే, పోలీసు స్టేషన్‌లను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం నెరుసుపల్లెకు వెళ్లి అక్కడ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల నూతన భవనాలను ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల

ఎర్రగుంట్ల : సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలో విడుదల చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.అన్వేష్ మాట్లాడుతూ ఈ సభకు సీపీఎం ప్రముఖులు హాజరవుతారన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లింగాల : లింగాల మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖ కార్యాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారిణి జయమ్మ తెలిపారు. 14వ తేదీన బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు, 19న విద్యార్థులకు దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

అనాథ వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న రాజ్‌కుమార్ దంపతులు

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎంపీటీసీ పద్మా జయలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మారెడ్డి రాజ్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. తన అమ్మ పద్మా వెంకట సుబ్బమ్మ 24వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పద్మారెడ్డి రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తూరు రెడ్డయ్య, కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు కార్తీక శోభ


ప్రత్యేక అలంకారంలో మిట్టమల్లేశ్వరుడు


శివలింగం


ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు

- ప్రారంభమైన కార్తీక మాసోత్సవం
- ముస్తాబైన శైవక్షేత్రాలు

పులివెందుల టౌన్ : కార్తీక మాసోత్సవం సోమవారం నుంచి ప్రారంభమైంది. దీంతో శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. భక్తులు పెద్దసంఖ్యలో శివాలయాలకు చేరుకుని కార్తీక పూజలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి తమ ఇష్టదైవమైన పరమ శివుడిని ఆరాధించారు. మహిళలు తెల్లవారుజామున లేచి తలంటు స్నానం ఆచరించి ఇంటి ముంగిట రంగువల్లులను అందంగా అలంకరించి అందులో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయాలకు వెళ్లి కాయ కర్పూరాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు శివునికి బిల్వార్చన, రుద్రాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంతోపాటు ఉమామహేశ్వరస్వామి ఆలయం, మండల పరిధిలోని నామాలగుండు సిద్దలింగేశ్వర స్వామి ఆలయం, పంచలింగాల, గుండాలయ్యకోనలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి అందరికి దర్శనం కల్పించారు. విద్యుత్ దీపకాంతులతో ఆలయాలను ముస్తాబు చేశారు.

నేటి నుంచి చెన్నూరులో..

చెన్నూరు : చెన్నూరు మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రధాన శివాలయాల్లో మంగళవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. చెన్నూరు పెన్నా నది ఒడ్డున వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈనెల ఈనెల 14వ తేదీ నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు కార్తిక మాస ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణోత్సవాలు గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. చెన్నూరు బస్టాండ్ సమీపంలో ఉన్న నాగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని శివాల్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న కాశీ విశ్వనాథ ఆలయంలో, అలాగే ఉప్పరపల్లి, రామనపల్లి, కొండపేట, బలిసింగాయపల్లి గ్రామ పరిధిలో ఉన్న కైలాసగిరి సిద్ధ లింగేశ్వర స్వామి ఆలయంలో కూడా ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


చెన్నూరు పెన్నానది ఒడ్డునగల శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం


విద్యుత్ దీపకాంతులతో వెలుగుతున్న మిట్టమల్లేశ్వరస్వామి ఆలయం

రైతుల గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబు, లోకేష్, రాంగోపాల్‌రెడ్డి, బీటెక్ రవిలకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి రామ్మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, గంగరాజులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దూదేకుల సంఘ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతుల గురించి ఇప్పుడు గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పడంతో చంద్రబాబు ఉచిత విద్యుత్ వల్ల విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవడానికి తప్ప ఎందుకు పనికి రాదని విమర్శ చేసిన మాటలు మరిచిపోయారని వారు గుర్తు చేశారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేముల మండలంలోని కరువు మండలాల గురించి ఆయనకు వివరించామన్నారు. రైతుల సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూర్చే విధంగా మన ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి 2014లో నలుగురు బ్రోకర్లను వెంట బెట్టుకుని నీరు – చెట్టు పనుల విషయంలో దళారిగా వ్యవహరించడం నిజం కాదా అని ప్రశ్నించారు. 2014–19 వరకు టీడీపీ హయాంలో ఎంత మందికి లబ్ధి చేకూర్చారో చెప్పాలన్నారు. 2019–23 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎంతమందికి లబ్ధి చేకూర్చామో చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు సవాల్ విసిరారు. వైఎస్ కుటుంబాన్ని కానీ, వైఎస్సార్‌సీపీని కానీ విమర్శించే నైతిక విలువలు టీడీపీ నాయకులకు కానీ, ఆ పార్టీ అధ్యక్షులకు లేవన్నారు.

ఆల్ ఇండియా కబడ్డీ టోర్నీకి కిరణ్ కుమార్ ఎంపిక


కిరణ్ కుమార్

చక్రాయపేట : ఆల్ ఇండియా కబడ్డీ టోర్నీకి మండలంలోని కుమారకాల్వ దళితవాడకు చెందిన నల్లవెంకిటిగాళ్ల కిరణ్ కుమార్ ఎంపికయ్యాడు. కాకినాడ జేఎన్‌టీయూ వేదికగా ఈనెల 9నుంచి జరిగిన సౌత్‌జోన్ కబడ్డీ టోర్నీలో కడప యోగివేమన యూనివర్సిటీ జట్టు ప్రతిభ కనబరచింది. దీంతో వైవీయూ తరపున ఆడిన బద్వేల్ నారాయణమ్మ వ్యాయామ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీపీఈడీ చదువుతున్న కిరణ్ కుమార్ కూడా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు యాకోబు, శ్యామలమ్మ, కోచ్ మనోహర్, వేంపల్లె జెడ్పీహైస్కూల్ పీడీ శనగల రాజశేఖర్.శివగణేష్‌ల ప్రోత్సాహంతో తాను కబడ్డీ పోటీలో రాణిస్తున్నట్లు తెలిపాడు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎల్. నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కెసి.బాదుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరి ప్రసాద్, కదిరి ప్రసాద్, రత్నం పాల్గొన్నారు.

వనభోజనం జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్ : కార్తీక వన భోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో వన మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహరావు, ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్రుడు, కోశాధికారి టి. సుదర్శన్, గౌరవాధ్యక్షుడు గోవిందు నాగరాజులు మాట్లాడారు. డిసెంబర్ 10వ తేదీ రాజంపేట రోడ్డు కనుమలోపల్లి వద్ద నున్న 108 శివలింగాల మహా శివలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు దుగ్గాయపల్లెలో 'మా నమ్మకం నువ్వే జగనన్నా'

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కేఆర్ఎమ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శనగ బస్తాలు చోరీ

పెద్దముడియం : పెద్దపసుపల గ్రామంలోని పేటవీధిలో ఉన్న పోతనబోయిన గురుదేవి ఇంట్లో శనగ బస్తాలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన గురుదేవి ఐదు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన కూతురు దగ్గరికి వెళ్లింది. సోమవారం రోజు ఇంటికి వచ్చిన గురుదేవి ఇంట్లో ఉన్న 8 శనగ బస్తాలు చోరీకి గురయ్యాయని గ్రహించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత కార్తీక మాసంలో వివిధ శైవ క్షేత్రాలకు నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ కన్యాకుమారి తెలిపారు. ప్రతి కార్తీక సోమవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పంచ క్షేత్ర దర్శిని బస్సును నడుపుతున్నామన్నారు. అలాగే పొలతల, నిత్యపూజకోనతోపాటు శ్రీశైలంకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నామన్నారు. అదేవిధంగా అయ్యప్పస్వామి భక్తులకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డికి తెలుపుకుంటున్న దృశ్యం

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిడుజివ్వి గ్రామంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు అందించే విధంగా రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ప్రవేశ పెట్టారన్నారు. దీని వల్ల ప్రతి పథకం ఇంటి ముంగింటికే చేరుతోందని చెప్పారు. ముస్లీం మైనార్టీ మహిళలు వారి సమస్యలను తెలుపుకున్నారు. తర్వాత ప్రజా సమస్యలపై స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పుష్పగిరిని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి


శ్రీ సంతాన మల్లేశ్వర స్వామికి కుటుంబ సభ్యులతో అభిషేకం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

వల్లూరు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని సందర్శించారు. మొదట పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే శ్రీ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. పవిత్ర పెన్నా నది ఒడ్డున గల రుద్రపాద ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి క్షేత్ర విశిష్టత, చరిత్ర, పంచ నదీ సంగమమైన పెన్నా నది గురించి వివరించారు. తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచనాలను అందచేశారు. అనంతరం గ్రామంలోని శ్రీ కామాక్షీ సమేత వైద్యనాథేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అలాగే పుష్పగిరి పీఠాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్ రావు, పురావస్తు శాఖ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను కాపాడుకునేందుకు నీరు విడుదల


డీబీఆర్ కాలువకు నీటిని విడుదల చేయిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వర్షాలు సక్రమంగా పడకపోవడం వల్ల వేసిన పంటలు ఎండిపోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరగుడి సమీపంలో ఉత్తర కాలువకు ఉపకాలువ అయిన డీబీఆర్ కాలువలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉత్తర కాలువకు సంబంధించిన ఉప కాలువల్లో జంబు ఎక్కువగా నిండుకోవడంతో తొలగింపు పనులను చేపట్టినట్లు తెలిపారు. కాలువల్లో నీరు వేగంగా ప్రవహించి రైతులు వేసిన పంటలకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోవైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


గుంతలో పడిన ఆర్టీసీ డ్రైవర్

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎర్రగుడిపల్లె ప్రాంతంలోని పాత వెంకటాపురం రోడ్డులో అండర్ డ్రైనేజీ పనుల కోసం సంబంధిత అధికారులు గుంతలు తవ్వారు. గుంతల వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారులు, పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్ సోమవారం తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. అదుపు తప్పి ద్విచక్రవాహనం గుంతలో పడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుంతలో పడ్డ ఆర్టీసీ డ్రైవర్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అండర్ డ్రైనేజీ పనులలో భాగంగా తీసిన గుంతల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్విజ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


విద్యార్థులకు బహుమతులు అందజేసిన క్లబ్ సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో పట్టణంలోని చల్లపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తమ సత్తాను చాటి మొదటి బహుమతి సాధించారు. సోమవారం పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మురళీధర్‌రెడ్డి మాట్లాడూతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, భాస్కర్, శివ గణపతి తదితరులు పాల్గొన్నారు.

బాసుదేవ ఆచార్య మృతి పట్ల సంతాపం

కడప కల్చరల్ : సీపీఎం మాజీ ఎంపీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (రైల్వేస్) మాజీ చైర్మన్ బాసుదేవ ఆచార్య మృతి పట్ల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన విశిష్టమైన కార్మిక నేత అని, పశ్చిమ బెంగాల్ లో బాన్కురా పార్లమెంట్ స్థానం నుంచి సీపీఎం తరపున 8 సార్లు గెలిచారని తెలిపారు. అయినా ఎక్కడా దర్పం, హంగామా లేకుండా ప్రజల్లో మమేకం అయి వారి సమస్యలు అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) నిర్వహించిన అనేక సమావేశాల్లో, కార్యక్రమాలలో ఆయన చురుకుగా పాల్గొన్నారని, అనేక సందర్భాల్లో ఆయన నాయకత్వంతోపాటు పార్లమెంట్ సభ్యులను, అధికారులను కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

15న చలో విజయవాడ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరితో లక్ష మందితో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెలుగులు నింపిన దీపావళి


టపాసులు కాల్చుతున్న దృశ్యం


కాకరత్తులు కాల్చుతున్న చిన్నారులు


టపాసుల దుకాణాల వద్ద పర్యవేక్షిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

వాడవాడలా దీపకాంతులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో ఆది, సోమవారాలలో దీపావళి పండుగ దీపకాంతులు నింపింది. కాకరపూలు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, వెలుగులు విరజిమ్మే తారాజువ్వలు ఇలా రకరకాల టపాసులను కాలుస్తూ ఇంటిల్లిపాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమావాస్య పూజలు, అమ్మవారి పూజలు నిర్వహించి ముత్తయిదువులకు వాయినాలు అందజేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : దీపావళి పండుగను ఆది, సోమవారాలలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు టపాసులు కాల్చుతూ ఆనందంగా గడిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జింకా శేఖర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలను నిర్వహించి మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : 56వ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి రాజశేఖర్ తెలిపారు. 14నుంచి 20వతేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కమలాపురంలో..

కమలాపురం : దీపావళి వేడుకలు ఇంటింటా సంతోషంగా జరుపుకున్నారు. చిన్న పిల్లలు టపాసులు కాల్చుతుంటే పెద్దలు పర్యవేక్షించారు. వీధుల్లో యువకులు గుంపులు గుంపులుగా చేరి టపాసుల శబ్దాలను మారు మోగించారు. కాగా మార్కెట్ యార్డు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారులు అధిక సంఖ్యలో రావడంతో అక్కడ సందడి నెలకొంది. కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి దుకాణాల వద్ద పర్యవేక్షించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా దుకాణాదారులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు.

పులివెందుల రూరల్

పులివెందుల రూరల్ : దీపావళి పండుగను పులివెందుల మండల పరిధిలోని గ్రామాల్లో ఆది, సోమవారాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రామాలయాలు, శివాలయాలలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.